భీమదేవరపల్లి : ముల్కనూరులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరాల్సిందే

- అసెంబ్లీ ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి/భీమదేవరపల్లి, ఆగస్టు 22 : ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీని చేసి తీరాల్సిందేనని, లేకుంటే ప్రత్యక్ష పోరాటాలకు దిగాల్సి వస్తుందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ హెచ్చరించారు. ఎల్కతుర్తిలో ఆందోళన కార్యక్రమానికి సతీశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో, మార్పు అంటే ఏంటో ప్రజలు గమనిస్తున్నారని, నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ బ్రహ్మాండమైన మార్పు తెచ్చారని ఎద్దేవా చేశారు. రైతులు నాట్లు వేసుకునే సమయం వచ్చినా రైతుబంధు అందివ్వలేని అసమర్థ సర్కారు అని విమర్శించారు. తమ హయాంలో దేవాదుల నార్త్ కెనాల్‌తో పాటు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా నీళ్లు అందించి రైతాంగాన్ని ఆదుకున్నామని గుర్తుచేశారు. పాన్‌కార్డు, రేషన్‌కార్డు, ఐటీలతో సంబంధం లేకుండా ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, రైతుబంధు డబ్బులను అందజేయాలని డిమాండ్ చేశారు. సెక్రటేరియట్ ముందు తెలంగాణ తల్లి విగ్రహమే పెట్టాలన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, మాజీ ఎంపీపీ మేకల స్వప్న, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, కడారి రాజు పాల్గొన్నారు.ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో వైఫల్యం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విసుగుచెంది ప్రజలు పునర్ మార్పు కోరుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే వొడితల అన్నారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరులో సిద్దిపేట–హనుమకొండ ప్రధాన రహదారిపై రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ధర్నా, రాస్తారోకో చేపట్టింది. ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. రేషన్‌కార్డు లేదని, పేర్లు తప్పులు దొర్లాయని సాకులు చెబుతూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సంగ సంపత్, జక్కుల అనిత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మండల సురేందర్, నాయకులు వంగ రవి, సల్వాల తిరుపతి పాల్గొన్నారు.

ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు రాకేశ్‌రెడ్డి

రైతులను నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్

ధర్మసాగర్, ఆగస్టు 22 : రైతులను నమ్మించి కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేశ్‌రెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని ఏపీజీవీబీ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పొంతన లేకుండా రుణమాఫీపై మాట్లాడడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు రైతు బంధు సాయం పంటలు సాగు చేసే ముందే ఇచ్చేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు బొడ్డు ప్రభుదాస్, మండలాధ్యక్షుడు రాజు, మాజీ ఎంపీటీసీ శోభ, నాయకులు లాల్, జుబేదా, గుర్రపు ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ తిరుపతిరెడ్డికి నివాళి

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 22 : జర్నలిస్ట్ తిరుపతిరెడ్డికి ప్రెస్ క్లబ్ సభ్యులు, జర్నలిస్టులు నివాళులర్పించారు. ఏకశిల ఆస్పత్రి(మ్యాక్స్‌కేర్)లో చికిత్స పొందుతూ మృతి చెందిన ఆయన మృతదేహాన్ని ప్రెస్‌క్లబ్‌కు తీసుకువచ్చారు. తిరుపతిరెడ్డి మృతదేహానికి మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నివాళులర్పించారు. తక్షణ సహాయం కింద ఆయన కుటుంబానికి రూ.25 వేలు అందించారు. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్, ఉపాధ్యక్షుడు బొడిగె శ్రీను, యంసాని శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ పొడిచెట్టి విష్ణువర్ధన్ తదితరులు నివాళులర్పించారు.

రైతులతో రాజకీయాలొద్దు

- వంద శాతం రుణమాఫీ చేయాల్సిందే..
- అన్నదాతలకు రేవంత్ సర్కార్ మోసం
- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ఏకశిల పార్కు ఎదుట ధర్నా
- తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

హనుమకొండ, ఆగస్టు 22 : రుణమాఫీ విషయంలో రైతులతో రాజకీయాలు చేయొద్దని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ హితవు పలికారు. బాలసముద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ స్మృతివనం (ఏకశిల పార్కు) ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఆంక్షలు లేకుండా వంద శాతం రుణమాఫీ చేయాలని నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్ల పాలు చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ రూ. 40వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి కేబినెట్ సమావేశంలో రూ.31 వేల కోట్లని ప్రకటించారని, బడ్జెట్లో మాత్రమే రూ. 26 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. కానీ ఇటీవల

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వినయ్ భాస్కర్

మంత్రులు రూ.17వేల కోట్లు మాత్రమే మాఫీ చేశామని అన్నారన్నారు. కానీ రైతులు ఖాతాలో పడ్డది మాత్రం రూ.7500 కోట్లు మాత్రమేనని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 22 లక్షల రైతుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ 8 నెలల పాలనలో కరెంటు కోతలు, బోనస్‌పై బోగస్ మాటలు, అన్నిపథకాల్లోనూ కోతలేనని ఆరోపించారు. కల్లోల కాంగ్రెస్ రైతులను ఆగ మాగం చేస్తోందని మండిపడ్డారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ అయ్యే వరకు రైతులకు అండగా బీఆర్ఎస్ పోరాడుతుందని స్పష్టం చేశారు. రైతుబంధు నిధులు అతీగతి లేదని అన్నారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ప్రభుత్వంపై పోరాటంలో కలిసి రావాలని కోరారు. రైతు బంధు రూ.15 వేలు ఇస్తామని మొత్తానికే ఎగ్గొట్టారన్నారు. కౌలు రైతులకు, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని వాటికి అతీగతి లేదని విమర్శించారు. అనంతరం పెగడపల్లి, వంగపహాడ్ గ్రామాల్లో రుణమాఫీకి సంబంధించి రైతుల వివరాలు ఇవ్వాలని కోరుతూ హనుమకొండలోని ఐవోబీ ఎదుట నిరసన వ్యక్తం చేసి బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మాఫీ చేస్తే అర్హులైన అందరికి చేయాలన్నారు. కేసీఆర్ సారు మాకు రెండు సార్లు రుణమాఫీ చేశారని, ఏటా రెండు సార్లు రైతు బంధు ఇచ్చేవారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ సగం సగం రుణమాఫీ చేస్తూ, రైతు బంధు, బీమా మొత్తం ఎగ్గొట్టిందని మండిపడ్డారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, రంజిత్ రావు, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, నాయకులు రామ్మూర్తి, జానకీరాములు, రవీందర్ రావు, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

రూ. 50వేలు మాఫీ చేయలేదు..

నా పేరు కాశెట్టి వేణు. మాది దామెర మండల పులుకుర్తి. 2018లో వ్యవసాయ పెట్టుబడి కోసం రూ. 50వేలు రుణం తీసుకున్నా. కానీ నాకు మాఫీ కాలేదని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పారు. బ్యాంకుకు వెళ్తే వ్యవసాయ అధికారులను కలవాలని తిప్పుతున్నారు. వడ్డీ కట్టలేదు రాలేదని అంటున్నారు. అసలు కట్టని వారికి కూడా రుణమాఫీ అయింది. ఇసొంటప్పుడు కాంగ్రెస్‌కు ఓటు ఎందుకు వేయాలి.

– కాశెట్టి వేణు, పులుకుర్తి, దామెర మండలం

నేను రుణమాఫీకి అర్హుడినే..

నేను రుణమాఫీకి అర్హుడైనప్పటికీ మాఫీ కాలేదు. నా పేర తీసుకొన్న రూ. 2లక్షల రుణమాఫీ అయితదని సంబురపడితే కాలేదు. వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులను అడిగితే సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఇప్పటికే చాలాసార్లు వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులు చుట్టూ తిరిగినా ఫలితం లేదు.

– గొల్లపల్లి సుధాకర్, ఊరుగొండ, దామెర మండలం

ప్రభుత్వ భూమి కబ్జా

ఆత్మకూరు, ఆగస్టు 22 : అక్కంపేట శివారులోని పెద్ద కెనాల్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తి దర్జాగా సిమెంట్ ఇటుకల తయారీ చేస్తున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులకు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన సిమెంట్ ఇటుకల తయారీ మిషన్

వ్యాయామ విద్య ఎంతో అవసరం

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 22 : సాధారణ విద్యతో పాటు విద్యార్థులకు వ్యాయామ విద్య కూడా అవసరమేనని కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి అన్నారు. కేయూ సెనేట్ హాల్‌లో యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వెంకయ్య అధ్యక్షతన గురువారం విశ్వవిద్యాలయ పరిధిలోని కాలేజీల ఫిజికల్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు ప్రత్యేక పరీక్షల వెసులుబాటు లేదని, సంబంధిత క్రీడాకారుడు విశ్వవిద్యాలయ పరిధిలోని కాలేజీల్లో పరీక్ష రాసే వెసులుబాటు కల్పిస్తామన్నారు. క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్ సురేశ్‌లాల్, ఫైనాన్స్ ఆఫీసర్ టీ రాజయ్య, కిట్స్ కాలేజీ పీడీ రమేశ్‌రెడ్డి కేడీసీ పీడీ సోమన్న, వ్యాయమ అధ్యాపకురాలు సావిత్రి, భాస్కర్, ఒప్పంద అధ్యాపకుడు కుమారస్వామి పాల్గొన్నారు.

శాయంపేట : రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ నాయకులు

రుణమాఫీ కాలేదంటూ రైతుల నిరసన

ఆత్మకూరు/శాయంపేట/వేలేరు, ఆగస్టు 22 : ప్రభుత్వం తమకు రుణమాఫీ చేయలేదంటూ రైతులు కొంతమంది పెద్దాపురం రైతు వేదిక వద్ద గురువారం నిరసన, ఆందోళన కార్యక్రమం చేపట్టారు. రుణ మాఫీ కాకపోవడంతో బ్యాంకులు, వ్యవసాయాధికారుల చుట్టూ రోజు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టారు. అందరికీ రుణమాఫీ చేయాలని నాయకులు ప్లకార్డులు పట్టుకుని నినదించారు. మాజీ ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ప్రజలను రుణమాఫీ పేరుతో మభ్యపెట్టి ఓట్లు దండుకుని మోసం చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంశెట్టి లక్ష్మారెడ్డి, ప్రసాద్, రమణారెడ్డి, సంజీవరావు పాల్గొన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2లక్షల రుణమాఫీ చేయాలని వేలేరు మండలాధ్యక్షుడు మరిజె నర్సింహారావు, మాజీ జడ్పీటీసీ చాడ సరితారెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వేలేరులోని ఎస్‌బీఐ వద్ద రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు చేయాలని రైతులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సంపత్, మాజీ సర్పంచ్ కాయిత మాధవరెడ్డి, నాయకులు ఇట్టబోయిన భూపతిరాజ్, కొయ్యడ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు : ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

28వ గవర్నర్ పర్యటన

హనుమకొండ, ఆగస్టు 22 : అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి గవర్నర్ జిష్ణు దేవ్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో ఆమె మాట్లాడుతూ.. జిల్లా అధికారులకు కేటాయించిన విధులను జాగ్రత్తగా నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్‌వో గణేశ్, డీసీపీ సలీమా, ఆర్డీవో వెంకటేశ్, డీటీవో శ్రీనివాస్, డీఎంహెచ్‌వో లలితాదేవి, డీవైఎస్‌వో అశోక్, డీసీ రవీందర్, ఈవీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణాలు పాటించాలి

పరకాల, ఆగస్టు 22 : పాలిటెక్నిక్ కళాశాలలో నాణ్యమైన విద్యా ప్రమాణాలు పాటించాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను తనిఖీ చేశారు. సెప్టెంబర్ 3న పట్టణంలో జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

తూకంలో మోసాలు

శాయంపేట, ఆగస్టు 22 : శాయంపేట బస్టాండ్ సెంటర్‌లో చేపలు అమ్ముతున్న మహిళ వద్ద ఉన్న తూకపు బాట్లను తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీ చేశారు. దీంతో కిలో బాటు 740 గ్రాములే ఉండడంతో అధికారులు తూకం వేసిన బాట్లు, తరాజును సీజ్ చేసి పట్టుకెళ్లారు.

మొక్కలు నాటాలి

హసన్‌పర్తి/ఆత్మకూరు/కమలాపూర్/దామెర, ఆగస్టు 22 : ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని జడ్పీ సీఈవో విద్యాలత అన్నారు. మండలంలోని పెంబర్తి పల్లె పకృతి వనంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఆమె గురువారం మొక్కలు నాటారు. ఎంపీవో కరుణాకర్‌రెడ్డి, ఏపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆత్మకూరు మండలంలోని 16 గ్రామాల్లో 815 మొక్కలను నాటారు. ఆత్మకూరు జడ్పీ హైస్కూల్‌లో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో పాటు విద్యార్థులు కలిసి పాల్గొని మొక్క నాటారు. ఏపీవో రాజిరెడ్డి, హెచ్‌ఎం నిర్మలాకుమారి పాల్గొన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలో పల్లె ప్రకృతి వనంలో నాటుదాం ఒక చెట్టు–అమ్మపేరు మీద అనే కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో బాబు మొక్కలు నాటారు. గ్రామ ప్రత్యేకాధికారి మజుందార్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. దామెరతో పాటు ఓగులాపురం, పసరగొండ, సీతారాంపురం, దమ్మన్నపేట, ఊరుగొండ, వెంకటాపురం, కోగిల్వాయి, దుర్గంపేట గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి బాలరాజు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి మొక్కలను నాటారు. ఎంపీవో రంగాచారి, ఏపీవో శారద పాల్గొన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

భీమదేవరపల్లి, ఆగస్టు 22: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ కోలా ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని ముల్కనూరులో ప్రజాగ్రంథాలయాన్ని సందర్శించి పాఠకులతో మాట్లాడారు. విద్యావంతులంతా కలిసి యువత భవిష్యత్ కోసం ప్రజాగ్రంథాలయాన్ని నెలకొల్పడం స్ఫూర్తిదాయకమన్నారు. ముల్కనూరు ప్రజాగ్రంథాలయం తెలంగాణ ఆధునిక సమాజానికి రోల్‌మాడల్‌గా నిలిచిందని కితాబిచ్చారు. విద్యావంతులు, మేధావులు, రాజకీయ నాయకులు కలిసి రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, మండలాల్లో ప్రజాగ్రంథాలయాలు నెలకొల్పాలని సూచించారు. అనంతరం గ్రంథాలయానికి రూ. 10వేల విలువైన పుస్తకాలను పాఠకులకు అందించారు. కార్యక్రమంలో ముల్కనూరు ప్రజా గ్రంథాలయ చైర్మన్ వంగ రవీందర్, నిర్వాహకులు గొల్లపల్లి లక్ష్మయ్య, తాళ్ల వీరేశం, ఎదులాపురం తిరుపతి, కొంరయ్య, కొలుగూరి రాజు, పాఠకులు పాల్గొన్నారు.

పుస్తకాలు అందిస్తున్న ప్రొఫెసర్ ఆనంద్

ఏడుగురు ఎస్సైల బదిలీ

సుబేదారి, ఆగస్టు 22 : వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఎస్సైలను బదిలీ చేస్తూ గురువారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. వీఆర్‌లో ఉన్న రాజేశ్‌రెడ్డి నర్సంపేటకు, వీఆర్ నుంచి పరమేశ్వర్ ఆత్మకూరుకు, వీఆర్ నుంచి అశోక్‌కుమార్ హనుమకొండకు, వీఆర్ నుంచి తిరుపతి నర్సంపేటకు, ఎస్‌బీలో ఉన్న నిహారిక పీసీఆర్‌కు, సీసీఎస్ ఎస్సైలు రాజు కేయూసీకి, రవి హసన్‌పర్తికి బదిలీ అయ్యారు.

మలేరియా, డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ప్రావీణ్య
- ఆరోగ్య ఉపకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

శాయంపేట, ఆగస్టు 22 : గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. నాలుగైదు రోజులు జ్వరాలు ఉన్నట్లయితే తప్పనిసరిగా టెస్టులు చేయాలన్నారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు జ్వరాల టెస్టు కిట్లను అందించామని ఆశలు, ఏఎన్ఎంలు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో తిరిగాలని సూచించారు. శాయంపేటలోని ఆరోగ్య ఉప కేంద్రం, ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఫీవర్ సర్వే, మందుల రికార్డులను తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ సోకిన వారి వివరాలను తెలుసుకున్నారు. సీరియస్‌గా ఉంటే ఎంజీఎం హాస్పిటల్‌కు రిఫర్ చేయాలని సూచించారు. ఆశ కార్యకర్తలు రోజుకు యాభై ఇండ్లు తిరగాలన్నారు. శాయంపేటలో 350 మంది బీపీ పేషెంట్లున్నారని వైద్యులు తెలిపారు. అన్నింటిని రికార్డులో చేర్చాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు కోడి గుడ్లు, బాలామృతం అందుతున్నాయా? అని అడిగారు. పిల్లల హైట్, బరువును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇప్పటికే మొదటి రౌండ్ ఫీవర్ సర్వేను పూర్తి చేశామన్నారు. వర్షాలు ఆగాయి కాబట్టి రెండో విడత ఫీవర్ సర్వేను మొదలు పెట్టాలని ఆదేశించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఫుడ్ స్టాక్‌ను ఎప్పటికప్పుడు చెక్ చేయాలన్నారు. కోడిగుడ్లను ట్రాన్స్‌పోర్టర్స్ సకాలంలో అందించడం లేదన్నారు. వారికి నోటీసులు ఇచ్చి కోడిగుడ్లు అయిపోక ముందే స్టాక్ సెంటర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని డీడబ్ల్యూవో రాజమణికి ఆదేశాలిచ్చామని పేర్కొన్నారు. శాయంపేట మండలానికి 108 వాహనం కేటాయింపుపై బుధవారమే కమిషనర్‌కు లేఖ రాశామని చెప్పారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో లలితాదేవి, సీడీపీవో స్వాతి, ఎంపీడీవో ఫణిచంద్ర, డాక్టర్ సాయికృష్ణ, హెల్త్ అసిస్టెంట్ చలపతి ఉన్నారు.

కాళోజీ కళాక్షేత్రం పనులు గడువులోగా పూర్తి చేయాలి

హనుమకొండ : బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రం పనులను గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులకు ఆదేశించారు. కళాక్షేత్రం నిర్మాణ పనులను జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈఈ భీమ్‌రావు, కూడా పీవో అజిత్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే భద్రకాళీ ఆలయం మాడవీధుల నిర్మాణం త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. భద్రకాళీ చెరువులో పూడిక తీయాలని సూచించారు. కాగా, భద్రకాళీ చెరువులోని నీటిని ఖాళీ చేయాల్సి ఉంటుందని అధికారులు తెలుపగా, నవంబర్‌లో నీటిని ఖాళీ చేయాలన్నారు. డీసిల్టింగ్, నాలా పనుల కోసం రూ.158 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అలాగే రుణమాఫీ కాని రైతుల వివరాలను అప్లోడ్ చేసిన వాటిని త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రుణమాఫీ కానీ రైతులు హెల్ప్‌డెస్కులల్లో దరఖాస్తు చేసుకోవచ్చని, ఇది నిరంతర ప్రక్రియన్నారు. నాలుగు రోజులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులను పరిష్కరిస్తారని తెలిపారు. రుణమాఫీ అయిన రైతుల రుణాలు రెన్యువల్ అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 43,881 మంది రైతులకు రుణమాఫీ జరిగాక, 21,426 మందికి రెన్యువల్ అయిందని, వారికి 1,741.12 కోట్లు జమ చేసినట్లు చెప్పారు. వ్యవసాయ అధికారి రవీందర్‌సింగ్ ఉన్నారు.

వైద్యులకు ఫీవర్ సర్వేపై సూచనలు ఇస్తున్న కలెక్టర్

నిరసనలో మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

మోసానికి కేరాఫ్ కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే చల్లా ■ రుణమాఫీ చేయాలంటూ ధర్నా

పరకాల, ఆగస్టు 22 : కాంగ్రెస్ ప్రభుత్వం మోసానికి కేరాఫ్‌గా నిలుస్తుందని, అందుకు నిదర్శనం రైతు రుణమాఫీ అని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు, రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతు రుణమాఫీపై సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పి రైతులను నయవంచనకు గురి చేస్తున్నారని, అన్నదాతకు అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ పార్టీ నిరసన కార్యక్రమం చేపట్టిందన్నారు. 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. ఇప్పటికే రెండు విడుతలుగా రైతు బంధు ఎగ్గొట్టారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, ఇప్పటికే రాష్ట్రంలో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, రానున్న రోజుల్లో దగాపడ్డ రైతన్న తిరగబడే రోజులు వస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింతం సదానందం, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి సారంగపాణి, పరకాల, మాదారం పీఏసీఎస్ చైర్మన్లు గుండెబోయిని నాగయ్య, నల్లెల్ల లింగమూర్తి, నాయకులు చింతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పల్లెబోయిన అశోక్, చందుపట్ల తిరుపతిరెడ్డి, శనిగరపు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బాకీలు చెల్లించాలంటూ మున్సిపల్ షట్టర్లకు తాళాలు

షట్టర్లకు తాళం వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

పరకాల, ఆగస్టు 22 : బాకీ పడ్డ కిరాయిలను వెంటనే చెల్లించాలంటూ మున్సిపల్ షటర్లకు కమిషనర్ నర్సింహ తాళం వేయించారు. పరకాల పాత మున్సిపాలిటీ పరిధిలో షటర్లను పలువురికి కిరాయి ఇచ్చారు. కొన్ని నెలలుగా పలువురు కిరాయిలు చెల్లించక పోవడంతో పెద్ద ఎత్తున బకాయిలు పేరుకుపోయాయి. దీంతో మున్సిపల్ సిబ్బందితో వచ్చిన కమిషనర్ షటర్లకు తాళాలు వేయించారు. ఈ సందర్భంగా కిరాయిదారులు మాట్లాడుతూ.. గిరాకీ లేకపోవడంతో కిరాయిలు చెల్లించలేదని, ఈ విషయాన్ని అప్పటి ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, వారు విడుతల వారీగా చెల్లించమని చెప్పడంతో నాలుగు నెలల నుంచి బకాయిలు చెల్లిస్తున్నామని తెలిపారు. అయినా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ కమిషనర్ తాళాలు వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా, బకాయిలు పెద్ద మొత్తంలో పేరుకు పోయాయని, సిబ్బందికి వేతనాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు.

అన్‌మ్యాన్డ్ కార్మికుల నిరసన

ఆత్మకూరు, ఆగస్టు 22 : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద జరిగిన అన్‌మ్యాన్డ్ కార్మికుల నిరసనలో టీజీఈఈయూ జిల్లా అధ్యక్షుడు బూర వరుణ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్‌మ్యాన్డ్ కార్మికులందరినీ ఆర్టిజన్లు గుర్తించాలని, స్కిల్డ్ వేతనం ఇవ్వాలన్నారు. జేఎల్ఎం నోటిఫికేషన్‌లో వెయిటేజీ ఇవ్వాలని, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వరుణ్

'అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్ల'పై విచారణ

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 22 : అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లపై అధికారులు విచారణ చేశారు. గురువారం సెక్టార్ సూపర్‌వైజర్ సుజనతో పాటు రాజ్యలక్ష్మి, ధూన్సీ పోచమ్మకుంట సెక్టార్‌లోని గుండ్లసింగారం–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. గుండ్లసింగారం–1 అంగన్‌వాడీ టీచర్ ఈ నెల 5 నుంచి 9 వరకు 2.5 కేజీల బాలామృతం, ఒక్కొక్కరికి 8 గుడ్ల చొప్పున 91 మందికి పంపిణీ చేశారని, ఇక్కడ ఎలాంటి సమస్యలు రాలేదన్నారు. కానీ దొగ్గెల సమన్విత ఈ నెల 5న ఒకేసారి మొత్తం 16 గుడ్లు ఇవ్వాలని టీచర్‌ని ఇబ్బంది పెట్టగా ఆమె భర్త తిరుపతికి ఇచ్చారన్నారు. తిరుపతి గుడ్లను ఈ నెల 21న ఉడకబెట్టగా అవి కుళ్లిపోయాయని, సకాలంలో ఉపయోగించకపోవడం వల్లే ఇలా జరిగిందని విచారణలో తేలిందని తెలిపారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

7800 నగదు, నకిలీ సీబీఐ, ప్రెస్ ఐడీ కార్డులు స్వాధీనం

సుబేదారి, ఆగస్టు 22 : మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం సుబేదారి పోలీసు స్టేషన్‌లో సీఐ సత్యనారాయణరెడ్డి వివరాలు వెల్లడించారు. కోల్‌కతాకు చెందిన నిమిత్ కెపాసి అలియాస్ అమిత్‌కుమార్, హనుమకొండ సాయినగర్‌కు చెందిన సుమన్ కాసాని హైదారాబాద్, వైజాగ్, వరంగల్, వివిధ పట్టణాల్లో కంపెనీల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి రూ.కోటీ 34లక్షలు వసూలు చేశారు. కాగా, హనుమకొండ జూలైవాడకు చెందిన సయ్యద్ రిజాజ్‌కు బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తామని డబ్బులు తీసుకొని వెళ్తుండగా టాస్క్‌ఫోర్స్, సుబేదారి పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి నకిలీ సీబీఐ కార్డు, ప్రెస్ కార్డు, నకిలీ ఆధార్, బ్యాంకు చెక్కులు, రూ.7,800 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

పీఏసీఎస్ గోడౌన్ అధికారి తొలగింపు

కమలాపూర్, ఆగస్టు 22 : మండలంలోని మర్రిపెల్లిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) గోడౌన్ అధికారి మొగిలిని గురువారం తొలగించినట్లు కార్యనిర్వహణాధికారి చోటేమియా తెలిపారు. పీఏసీఎస్ గోడౌన్ నుంచి రైతుల పేరిట యూరియా బస్తాలు బ్లాక్ మార్కెట్‌కు తరలుతున్నట్లు రైతులు ఫిర్యాదు చేయడంతో గోడౌన్ ఇన్‌చార్జి నుంచి కమలాపూర్ పీఏసీఎస్ కార్యాలయానికి పంపినట్లు చెప్పారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

హసన్‌పర్తి, ఆగస్టు 22 : విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉన్నత స్థాయికి చేరవచ్చని ఎస్సార్ విద్యా సంస్థల చైర్మన్ ఏ వరదారెడ్డి అన్నారు. అనంతసాగర్ శివారులోని సుమతిరెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్‌లో చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. హెచ్‌ఆర్ అభిషేక్, ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి, వాణిశ్రీ, సుదర్శన్, మహేందర్, శ్రీవాణి, వేణుగోపాలస్వామి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ వరదారెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

VEHICLES FOR SALE
★TS03UD5115THIRUPATHI MAHINDRAYUVO TECH+ 405 DIGOLLENA 2023 Auction Date: 24-08-2024, Venue: Shriram Automall India Ltd, Punnel Cross Road Bollikunta, Warangal Cont: Shriram Finance Limited, H.No :15-1-237, 2nd Floor Opp: L.B. College, Mulugu Road, Cell: 9849981545, 9177772966.
NTW-14482

PLOT FOR SALE
★హైదరాబాద్‌లో ఫోర్త్ సిటీగా మహేశ్వరం, కందుకూరు, ముచ్చర్లలో ప్లాట్లు, విల్లాలు, ఇండ్లు అమ్మబడును. న్యూయార్క్, సింగపూర్‌లా శ్రీశైలం హైవే... Cont: 8008091512.
NT-332632

TO-LET
★3 Bed Room Flat in GMR Brindavan, Waddepally, 5th Floor and Car Parking available for Rent. Contact Ph: 9849123115.
NT-331671

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

WANTED
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325792-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

మరిన్ని వార్తలు 9వ పేజీలో